

విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బంజారాహిల్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. దీపావళిని పురస్కరించుకొని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో 300 మంది విద్యార్థులకు మంగళవారం ఆమె పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు

● కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మధుకర్



మధుకర్ యాదవ్

ఖైరతాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి యాదవుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మంగళారపు మధుకర్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన ఖైరతాబాద్‌లో మాట్లాడుతూ.. రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి యాదవుల మద్దతు ఉంటుందన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఎట్టకేలకు మొదలైన రోడ్డు పనులు

బంజారాహిల్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరద ముంచెత్తడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో నాలుగు నెలలుగా ఇబ్బంది పడుతున్న ఫిలింనగర్ బండారు బాల్‌రెడ్డినగర్ వాసులకు ఊరట కలిగింది. పలు ఆటంకాలతో ఆగిపోయిన రోడ్డు పనులు మొదలయ్యాయి. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి కాలేదు. చివరకు మంగళవారం ఈ పనులు మొదలయ్యాయి. మంగళవారం పనులను స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పర్యవేక్షించారు.



ఎమ్మెల్యే వివేక్‌తో మాలల ఆత్మగౌరవ సభ నాయకులు

ఎమ్మెల్యే వివేక్‌ను కలిసిన మాలల ఆత్మగౌరవ సభ ప్రతినిధులు

బోరబండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవంబర్ మొదటి వారంలో జరిగే సభకు మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని మాలల ఆత్మగౌరవ సభ బోరబండ కన్వీనర్‌లు జైభీమ్ యాదగిరి, బొట్టు శివ, రాష్ట్ర మాల సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు దాసరి బానుచందర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను ఆయన నివాసంలో కలిసి సభ నిర్వహణపై చర్చించారు. దళిత కులాల మధ్య వర్గీకరణ చిచ్చుపెట్టి విడదీశారని వారు అన్నారు.



వేడుకల్లో పాల్గొన్న కాంట్రాక్ట్ వర్కర్స్, యూనియన్ నాయకులు

నల్లపోచమ్మకు బోనాలు

ఎర్రగడ్డ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలోని నల్లపోచమ్మ దేవాలయంలో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఇన్‌చార్జి పిట్టల లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలలో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రొఫెసర్ ఫణికాంత్, ఆర్‌ఎంవో పద్మజ, సైకాలజిస్ట్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, సీఐటీయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జయకుమార్ స్వామి, కార్యదర్శి ఎన్.సైదయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులపై యువకుడి దురుసు ప్రవర్తన.. కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నేనేమైనా నక్సలైట్‌నా, టెర్రరిస్టునా అంటూ ట్రాఫిక్ పోలీసులపై చిందులేసిన యువకుడిపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీలు చేపడుతుండగా మంగలి శ్రీనివాస్ ఓ యువతితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. పోలీసులు తనిఖీ చేయగా 8 చలానాలు ఉండటంతో చెల్లించాలని చెప్పడంతో పోలీసులపట్ల దురుసుగా ప్రవర్తించాడు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ శాంతిభద్రతల పోలీసులు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళ తప్పిన ఇండోర్ స్టేడియం

● నిర్వహణ లోపంతో అందవిహీనంగా మారిన కేవీబీఆర్ స్టేడియం
● అసౌకర్యంగా ఉంటున్నదంటున్న క్రీడాకారులు
● మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి



కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం



దెబ్బతిన్న స్టేడియం పైకప్పు

యూసుఫ్‌గూడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎందరో క్రీడాకారులకు భవిష్యత్తు ఇస్తున్న యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం అందవిహీనంగా కనిపిస్తోంది. స్టేడియం లోపలివైపు సైతం పాడైపోయి క్రీడాకారులకు ఇబ్బందికరంగా మారింది. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారి నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని శిక్షణకు వచ్చే క్రీడాకారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. స్టేడియం ముఖభాగం దెబ్బతినడంతో పాటు వెనుకవైపు అద్దాలు పగిలిపోయాయని, పైకప్పు ధ్వంసం కావడంతో వర్షం పడినప్పుడు అసౌకర్యంగా ఉంటుందంటున్నారు. ఏసీలు సరిగా పనిచేయడం లేదని.. పార్కింగ్ ప్రాంతంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ పైకప్పులు, స్కేటింగ్ రింగ్ దెబ్బతినడంతో పాటు స్టేడియం ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రత నెలకొంది.

నిత్యం క్రీడాకారులకు శిక్షణ

ఉమ్మడి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఈ స్టేడియాన్ని ప్రారంభించారు. సెంట్రలైజ్డ్ ఏసీ, రెండు వేలకు పైగా ప్రేక్షకులు కూర్చొని క్రీడలను వీక్షించే ఏర్పాట్లు చేశారు. జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీలకు ఈ స్టేడియం వేదికగా మారింది. ప్రొకబడ్డీ పోటీలను నిర్వహించారు. చిత్రపరిశ్రమకు చెందిన పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇక ఎన్నికలు వచ్చాయంటే ఎన్నికల అధికారులు స్టేడియంను తమ అధీనంలోకి తీసుకుని డీఆర్‌సీ కేంద్రంగా ఉపయోగిస్తారు. మరోవైపు ఏడాది పొడవునా ఇక్కడ చిన్నారులకు షటిల్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కరాటే, బాక్సింగ్, ఇండియన్ స్టైల్ రెజ్లింగ్, స్కేటింగ్ తదితర అంశాలలో శిక్షణ ఇస్తారు. వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న క్రీడాకారులు జాతీయ స్థాయి పతకాలు సైతం సాధించారు. ఇంతటి ఘనత కలిగిన స్టేడియాన్ని ఇలా వదిలేయడం సరికాదని.. మరమ్మతులు చేసి సౌందర్యవంతంగా తీర్చిదిద్దాలని క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేవ్ పార్టీని కుటుంబ పార్టీ అంటారా?

● ఎమ్మెల్యే తలసానిపై కోట నీలిమ ఫైర్



డా. కోట నీలిమ

బేగంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రేవ్ పార్టీని కుటుంబ పార్టీగా చెప్పడం విడ్డూరంగా ఉందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. జన్వాడ ఫామ్‌హౌస్‌లో జరిగిన ఘటపై ఆమె మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదేళ్లుగా హైదరాబాద్‌లో డ్రగ్స్, రేవ్ పార్టీలు జరిగినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించారు. జన్వాడ ఫామ్‌హౌస్ ఘటనను రాజకీయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై ఆమె మండిపడ్డారు. డ్రగ్స్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంటే.. తప్పులు వెతకడం సరికాదని బీఆర్‌ఎస్ నేతలకు హితవు పలికారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

అమీర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌నగర్ గ్రంథాలయంలో చదువుకుంటూ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించిన మేడబోయిన పృథ్వీరాజ్‌ను మంగళవారం గంథాలయ అధికారి హరిబాబు సన్మానించారు. గ్రంథాలయాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మెరుగైన సేవలందించేందుకు కృషి

● ఎర్రగడ్డ రైతుబజార్ ఎస్టేట్ అధికారి పి.రమేష్



ఇంటర్వ్యూ...

ఎర్రగడ్డ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ రైతుబజార్‌లో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామ రైతుబజార్ ఎస్టేట్ అధికారి పి.రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

దళారుల సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

దళారులను గుర్తించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన రైతుల గుర్తింపు కార్డులను రద్దు చేసి కొత్త కార్డులను అందిస్తున్నాం. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

ఎక్కువ ధరలకు అమ్మడంతో పాటు వినియోగదారుల పట్ల రైతులు దురుసుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి కదా?

బోర్డులో డిస్‌ప్లే చేసిన ధరలు ఆ రోజు ఉదయం 9.30 గంటల వరకే అమలులో ఉంటాయి. ఆ తర్వాత ఆ రోజుకు ప్రభుత్వం నిర్ధారించిన ధరలు అమలులోకి వస్తాయి. అందుకే ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. అధిక రేట్లకు విక్రయించేవారిపై, దురుసుగా వ్యవహరించే వారికి జరిమానా వేయడం లేదా వారం పాటు సస్పెండ్ చేస్తాం. ఇక సంచార రైతుబజార్‌ల వద్ద రూ.3 నుంచి రూ.4 అధిక ధర ఉంటుంది.

రైతుబజార్‌లో అపరిశుభ్రత అధికంగా ఉంటుంది. దీనికి మీరు తీసుకుంటున్న చర్యలేంటి?

గతంలో అపరిశుభ్రత వాస్తవమే కానీ ఇప్పుడు ప్రతిరోజూ చెత్తను తొలగిస్తున్నాం. గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం రైతుబజార్ పరిసరాలు పరిశుభ్రంగానే ఉంటున్నాయి.

దొంగల బెడద ఎక్కువగా ఉంది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రద్దీగా ఉండే సమయాలలో డబ్బులు, నగలు, సెల్‌ఫోన్లు జాగ్రత్తగా ఉంచుకోవాలని అనౌన్స్‌మెంట్ చేయిస్తున్నాం. ప్రస్తుతం రైతుబజార్‌లో 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. రద్దీగా ఉంటే పోలీసులు సైతం ఉంటున్నారు.

పార్కింగ్ సమస్య అధికంగా ఉంది కదా?

పార్కింగ్ సమస్య లేకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. ద్విచక్ర వాహనాలను కేవలం షెడ్ కింద మాత్రమే అనుమతి ఇస్తున్నాం. కార్లను లోపల వరుస క్రమంలో నిలిపేలా చర్యలు తీసుకుంటున్నాం.



అర్జీలను స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి, దివ్య

ప్రజావాణికి 588 అర్జీలు

బేగంపేట, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 588 ఫిర్యాదులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువగా అర్జీలను అందజేసినట్లు అధికారులు తెలిపారు. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. మైనార్టీ వెల్ఫేర్ 221, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 98, విద్యుత్ శాఖ 84, రెవెన్యూ 55, ప్రవాసీ ప్రజావాణికి 4, ఇతర శాఖలకు సంబంధించి 126 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని కలిసిన టీజీఓ ప్రతినిధులు

టీజీఓల సమస్యలను పరిష్కరించండి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని హైదరాబాద్ జిల్లా టీజీఓ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డిని గెజిటెడ్ ఆఫీసర్స్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణాయాదవ్, సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఇతర అధికారులు కలిశారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

సింగరేణి తరహాలో బోనస్ ఇవ్వండి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు ప్రభుత్వం ఇస్తున్న దసరా, దీపావళి బోనస్‌ల మాదిరిగా ఇతర ప్రభుత్వ సంస్థల్లో సైతం ఇవ్వాలని ఉద్యోగ సంఘాల సమాఖ్య కోరింది. బషీర్‌బాగ్ కార్యాలయంలో మంగళవారం సంఘాల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వరంగ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ బాలకిషన్, ప్రధాన కార్యదర్శి టీజీ జీవన్ సీఎం పేషీలో వినతిపత్రం అందజేశారు.



డివిజన్ పరిధిలో పెండింగ్ పనులపై జలమండలి మేనేజర్ రాంబాబుతో చర్చిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి
- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

స్ట్రోక్ లక్షణాలపై అవగాహన



స్ట్రోక్ బాధితుడితో కిమ్స్-సన్‌షైన్ వైద్యులు



మెడికవర్ ఆస్పత్రిలో హెల్త్ చెకప్ ప్యాకేజీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సరళ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి నిమిషానికి మెదడులో మిలియన్ల కొద్దీ నరాలు దెబ్బ తినడం జ్ఞాపక శక్తిని శాశ్వతంగా కోల్పోయేలా చేస్తుందని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి న్యూరో వైద్యులు పేర్కొన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ గోపాల్, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ నివేదిత సాయి చంద్ర స్ట్రోక్ లక్షణాల గురించి వివరించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడంతో పాటు జీవనశైలిలో మార్పులు చేసుకుంటే బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని వారు పేర్కొన్నారు.

స్ట్రోక్ మనిషిని కుంగదీస్తుంది

అమీర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్ట్రోక్ మనిషిని కుంగదీసే ప్రమాదకరమైన వ్యాధి అని అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ అన్నారు. ప్రపంచ స్ట్రోక్ డేను పురస్కరించుకుని అమీర్‌పేటలోని మెడికవర్ ఆస్పత్రిలో మంగళవారం స్ట్రోక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సరళ హెల్త్ చెకప్ ప్యాకేజీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కన్సల్టెంట్ న్యూరాలజిస్టు డాక్టర్ శిల్పా కేసి రెడ్డి మాట్లాడుతూ.. భారత్‌లో మరణాలకు స్ట్రోక్ నాలుగో ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సెంటర్‌హెడ్ రాజ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ అభిలాష్ పాల్గొన్నారు.

రోగికి వీల్‌చైర్ అందజేసిన నిమ్స్ పీఆర్వో



వీల్‌చైర్ అందజేసిన పీఆర్‌ఓ ఆశారాణి, సత్యగౌడ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా నాంపల్లి గ్రామానికి చెందిన కమిశెట్టి చంద్రకళకు నిమ్స్ పీఆర్‌ఓ వై.ఆశారాణి మంగళవారం వీల్‌చైర్ అందజేశారు. చంద్రకళ గత 9 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వారానికి మూడు రోజులు డయాలసిస్ కోసం నిమ్స్‌కు వస్తుంది. అయితే ఇటీవల ఆమెకు పక్షవాతం వచ్చి రెండు కాళ్లు పనిచేయడం లేదు. స్పందించిన పీఆర్వో ఆశారాణి ఆమెకు సహాయం చేశారు.

రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి జైలు

బోరబండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఎండీ కమ్రాన్(29)కు భార్యను వేధించిన కేసులో ఐదు రోజుల జైలు శిక్ష పడింది.

మరో ఘటనలో..

బోరబండ నేతాజీనగర్‌కు చెందిన అద్నాన్ అలీ ఖాన్ (24) సమయం మించినా హోటల్ వ్యాపారం నిర్వహిస్తుండటంతో బోరబండ పోలీసులు మంగళవారం సంబంధిత న్యాయస్థానంలో హాజరుపరిచారు. అతడికి న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

బోరబండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్స్ట్రక్షన్స్ వ్యాపారంలో నష్టం రావడంతో ముగ్గురు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతినగర్‌లో డాక్టర్ వెంకట్, భార్య సుజాత(38), లౌక్య(18), అమృత (15)అనిరుధ్(9) ఉంటున్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో కొంతకాలంగా మనోవేదనకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో సుజాత తన ముగ్గురు పిల్లలతో సహా థైరాయిడ్ వ్యాధికి సంబంధించిన మాత్రలను మింగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

సంప్రదాయ వైద్యంపై అవగాహన పెరగాలి



దన్వంతరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శశాంక్ గోయల్

బంజారాహిల్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయ వైద్య విధానాలపై ప్రజల్లో అవగాహన పెరగాలని ఎంసీహెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్, ఆయూష్ డైరెక్టర్ శశాంక్ గోయల్ అన్నారు. జాతీయ అయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంసీహెచ్‌ఆర్‌డీ ఆయూష్ సెంటర్‌లో మంగళవారం దన్వంతరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శశాంక్ గోయల్ మాట్లాడుతూ.. ప్రకృతి ప్రసాదించిన వనరులతో మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించే విధానాన్ని దన్వంతరి లోకానికి తెలియజేశారన్నారు. అయుర్వేదం, సిద్ధ, యోగ-నేచురోపతి, హోమియోపతి ఇలా అనేక వైద్య విధానాలు ప్రాచుర్యం పొందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ వైద్యులు డాక్టర్ విమలాకుమారి, డాక్టర్ భావన, డాక్టర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో నిర్మించే
కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టండి



సమావేశంలో పాల్గొన్న గద్దర్ గళం వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లూరి సత్తయ్య తదితరులు

పంజాగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో నిర్మిస్తున్న కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని, తెలంగాణ సాధన కోసం అసువులు బాసిన కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని గద్దర్ గళం సంస్థ డిమాండ్ చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లూరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసునూరి రవీందర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సామాజిక వేత్త ఎ.సమ్మిరెడ్డి మాట్లాడారు. ఇప్పటికే వరంగల్‌లో హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ నారాయణరావు పేరు ఉన్న కారణంగా కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ కోసం పోరాడిన కళాకారులు గద్దర్, గూడ అంజయ్య, చుక్క సత్తయ్య, బెల్లి లలిత, గ్యార యాదయ్య, వరంగల్ శంకర్, సారంగపాణి, ఎర్ర ఉపాళి, సాయిచంద్ విగ్రహాలను కళాక్షేత్రంలో ఏర్పాటు చేయాలని కోరారు.

గోపాలమిత్రలకు పెండింగ్ జీతాలివ్వండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న మారబోయిన రవీందర్

పంజాగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాల మిత్రలకు 6 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని రాష్ట్ర గోపాల మిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారబోయిన రవీందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖలో 1,530 మంది గోపాల మిత్రలు పనిచేస్తున్నారని, వారి సేవలను గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. తమ వినతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారని రవీందర్ తెలిపారు. ఆయన వెంట సంఘం నాయకులు సత్యనారాయణ, పి.మహేష్, గోపాలమిత్రలు ఉన్నారు.

కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు

● టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నిబంధనలను ఉల్లంఘించిన పరిశ్రమలను మూసి వేయడంతో పాటు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సభ్య కార్యదర్శి రవి హెచ్చరించారు. కాలుష్యం, దుర్వాసన సమస్యలపై నగరంలోని పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో పీసీబీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. పారిశ్రామిక ప్రాంతాల్లో దుర్వాసనను నియంత్రించడంలో పారిశ్రామిక సంఘాలు క్లస్టర్ల వారీగా కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిని సంఘాల ప్రతినిధులు గుర్తించకపోతే, ఆ ప్రాంతంలోని అన్ని పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్ణీత సమయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులందరూ తనిఖీలు నిర్వహించాలని, పరిశ్రమల్లోని పరికరాల నాణ్యత, నిర్వహణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం..

ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం మొదటి ప్రాధాన్యంగా తీసుకుంటున్నదని రవి వెల్లడించారు. హైదరాబాద్ చుట్టుపక్కల వెలువడుతున్న దుర్వాసనపై నివాసితుల నుంచి ప్రజావాణి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అనేక ఫిర్యాదులు అందాయని.. వాటిపై సత్వర చర్యలకు ఆదేశించామన్నారు.

ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి నిధుల కొరత


ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

సికింద్రాబాద్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నిధుల కొరత ఏర్పడడం శోచనీయమని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్, జోషి కంపౌండ్‌లో 33లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను, టీఆర్‌టీ కాలనీ పార్కులో రూ.7 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు ఉపకరించే కార్యక్రమాలను, అభివృద్ధి పనులను తాము చేపడుతున్నామని తెలిపారు. అధికారులు ప్రొటోకాల్ నిబంధనలను పాటించకపోవడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ, జోషి కంపౌండ్ అధ్యక్షుడు రాజ సుందర్, ప్రధాన కార్యదర్శి సుభాష్, టీఆర్‌టీ కాలనీ సంఘం నేతలు జుగ్ను శేఖర్, రాజేష్‌సింగ్ పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి


బోర్డు సీఈవో మధుకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవి కో-ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు

మారేడుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మహేంద్ర హిల్స్ రవి కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కొత్త సంజీవరెడ్డి కోరారు. ఈ మేరకు సొసైటీ ప్రతినిధులతో కలిసి మంగళవారం కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌ను కలిసి వినతిప్రత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు ఎగుడు దిగుడుగా ఉన్నాయని, నీటి సరఫరాను మెరుగుపరిచి, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని సీఈవోకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. చిల్డ్రన్స్ పార్కును అభివద్ధి చేయాలని కోరారు. వినతిపత్ర అందజేసిన వారిలో ఉపాధ్యక్షుడు సి.చంద్రమోహన్, కార్యదర్శి ఏ.శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు జేఎం.నర్సింగరావు, వి.శ్రీనివాస్ తదితరులున్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ


బస్తీ వాసులతో సమావేశమైన ఇన్‌స్పెక్టర్

బోయిన్‌పల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అనుమానిత వ్యక్తుల గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో మొదటిది బోయిన్‌పల్లిలోని దిల్‌ఖుష్‌నగర్ ఒకటి ఆయన అన్నారు. కొంతకాలంగా ఇతర ప్రాంతాల వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్టు ఫిర్యాదులు అందాయాని పేర్కొన్నారు. రెండు రోజుల నుంచి కాలనీలు, బస్తీవాసులతో పోలీసులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అపరిచిత వ్యక్తుల గురించి స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ కొత్తవారు అనుమానాస్పదంగా కనిపిస్తే ముందుగా వారి గుర్తింపు కార్డును అడిగి వివరాలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలోకి ఇళ్ల అద్దెకోసం వస్తే వారి పూర్తి వివరాలు సేకరించడంతోపాటు ఆధార్ కార్డును పరిశీలించాలన్నారు. అవసరమైతే పోలీసులను సంప్రదించిన తరువాత ఇళ్లు అద్దెకు ఇవ్వాలన్నారు. కొత్తవ్యక్తులు చెబుతున్న మాటలు నమ్మొద్దని, వారి కదిలికలపై నిఘాపెట్టాలన్నారు. కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు, మతపెద్దలు, స్థానిక పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌మన్ల సంక్షేమానికి మజ్దూర్ యూనియన్ కృషి


మజ్దూర్ యూనియన్‌లో చేరిన రైల్వే ట్రాక్‌మన్ అసోసియేషన్ సభ్యులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వే రంగంలో పనిచేస్తున్న రైల్వే ట్రాక్‌మన్ల సంక్షేమానికి రైల్వే మజ్దూర్ యూనియన్ కృషి చేస్తున్నదని దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు చెప్పారు. మంగళవారం సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి రవీందర్, జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు, అధ్యక్షుడు మురళీధర్ సమక్షంలో రైల్వే ట్రాక్‌మన్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మూర్తి, ప్రధానకార్యదర్శి ప్రభాకర్‌తోపాటు పలువురు అసోసియేషన్ సభ్యులు మజ్దూర్ యూనియన్‌లో చేరారు. ఈసందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల సంక్షేమం కోసం మజ్దూర్ యూనియన్ కట్టుబడి ఉన్నదన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం, పీఎన్‌ఎంలో డిమాండ్లు సాధించడం మజ్దూర్ యూనియన్‌కే సాధ్యమనదన్నారు. మజ్దూర్ యూనియన్‌లో రైల్వే ఇంజనీరింగ్ కార్మికులకు పెద్దపీట వేసి రైల్వే క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) అధ్యక్షుడిగా ఒక ట్రాక్‌మన్‌ను నియమించినట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ వర్కింగ్ సభ్యుడు శ్రీనివాస్, అసిస్టెంట్ డివిజనల్ సీసీఎస్ అధ్యక్షుడు స్వామి, కోశాధికారి నర్సింహారెడ్డి, కార్యదర్శులు సమ్మయ్య, స్వామి, అంజయ్య, మీసాలు శేఖర్ పాల్గొన్నారు.

ప్రతి 40 సెకన్లకు ఓ వ్యక్తికి స్ట్రోక్

దేశంలో వార్షికంగా 1.66 మిలియన్ల కొత్త కేసులు


సరళ హెల్త్‌చెకప్ ప్యాకేజీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సరళ

అమీర్‌పేట, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): స్ట్రోక్ అకస్మాత్తుగా సంభవిస్తున్నదని, అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి బ్రెయిన్ స్ట్రోక్ బారినపడి కొన్ని సందర్భాలలో మరణానికి దారితీస్తున్నదని అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ పేర్కొన్నారు. ప్రపంచ స్ట్రోక్ డేను పురస్కరించుకుని అమీర్‌పేటలోని మెడికవర్ ఆస్పత్రిలో స్ట్రోక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి హాజరైన కార్పొరేటర్ సరళ హెల్త్ ప్యాకేజీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కన్సల్టెంట్ న్యూరాలజిస్టు డాక్టర్ శిల్పా కేసిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 40 సెకన్లకు ఓ వ్యక్తి స్ట్రోక్ బారినపడుతున్నారన్నారు. భారతదేశంలోనే వార్షికంగా 1.66 మిలియన్ల కొత్త కేసులు నమోదవుతున్నాయని, ప్రధానంగా మరణాల రేటు పెరిగి ప్రతి లక్ష జనాభాలో 86.5 సంభవిస్తున్నాయన్నారు. స్ట్రోక్ భారత్‌లో మరణానికి నాల్గవ ప్రధాన కారణం అన్న ఆయన, అంగ వైకల్యానికి ఐదో కారణం అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సెంటర్ హెడ్ రాజ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు: కిమ్స్ సన్‌షైన్ వైద్యులు


అవగాహన కల్పిస్తున్న న్యూరో వైద్యులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి నిమిషానికి మెదడులో మిలియన్ల కొద్ది నరాలు దెబ్బతినడం, జ్ఞాపకశక్తిని, పనితీరు శాశ్వతంగా కోల్పోయేలా చేస్తున్నదని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి న్యూరో వైద్యులు వివరించారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా స్ట్రోక్ లక్షణాలను గుర్తించడం, సకాలంలో వైద్య సేవలు ఎలా తీసుకోవాలనే అంశంపై బేగంపేటలోని కిమ్స్‌సన్ షైన్ ఆస్పత్రిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ గోపాల్, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ నివేదిత సాయి చంద్ర తదితరులు స్ట్రోక్ లక్షణాలు ఎలా ఉంటాయి, ఎలా గుర్తించాలి, ఎంత త్వరగా వైద్య సేవలు అందించాలనే విషయాలపై వివరించారు. స్ట్రోక్‌తో బాధపడుతూ చికిత్స అనంతరం కోలుకున్న పేషంట్‌కు అందించిన చికిత్సలను వారు వెల్లడించారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలను పట్టించుకోకపోవడం, విస్మరించడం కారణంగా ఆలస్యంగా ఆస్పత్రులకు చేరుకుంటున్నారని వైద్యులు తెలిపారు. రోజువారి వ్యాయామం, జీవనశైలిలో మార్పుల ద్వారా బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలను గుర్తిస్తే బి ఫాస్ట్ అమలు చేయాలని సూచించారు. బ్యాలెన్స్ తప్పడం, ఆకస్మిక దృష్టిలోపం, ముఖం ఒక వైపు వంగిపోవడం, చేతులు బలహీన పడడం, మాట్లాడడంలో తడబడడం, స్పందించకపోవడం వంటి ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి'

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం అన్యాయం అని ఏఐఎస్ఎఫ్ పేర్కొంది. అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని, బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్‌ప్రొఫెషనల్ విద్యార్థులకు రూ.2000 కోట్లు, ప్రొఫెషనల్ విద్యార్థులకు రూ.4000 కోట్ల ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలి

సుభాష్, ఫైర్ సేఫ్టీ అధికారి, సికింద్రాబాద్

ఇంటర్వ్యూ



రాంగోపాల్‌పేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సికింద్రాబాద్ ఫైర్ సేఫ్టీ అధికారి సుభాష్ సచించారు. టపాసుల దుకాణాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే తదితర విషయాలపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు సూచనలు చేశారు.

టపాసులు కాల్చే సమయంలో ఎలాంటి దుస్తులు ధరించాలి?

టపాసలు కాల్చే సమయంలో వదులుగా ఉండే సిల్క్ దుస్తులు కానీ, సులభంగా మంటలు అంటుకునే దుస్తులను దరించకూడదు. బిగుతుగా ఉండే కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి.

ఏ సమయంలో ఎక్కడ టపాసులు కాల్చాలి?

రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య టపాసులు కాల్చాలి. ఇంటి బయట కారిడార్, ఆరుబయట ఖాళీ ప్రదేశంలోనే టపాసులు కాల్చాలి.

టపాసులు కాల్చే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటీ?

టపాసులు కాల్చే సమయంలో త్వరగా మంటలు అంటుకునే వస్తువులను దూరంగా ఉంచాలి. మంటలను ఆర్పివేయడానికి డ్రమ్ములలో నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. చిన్న పిల్లలను ఒంటరిగా టపాసులు కాల్చకుండా తల్లిదండ్రులు వారికి తోడుగా ఉండాలి. బాణసంచా కాల్చే సమయంలో తగిన దూరాన్ని పాటిస్తూ, వ్యతిరేఖ దిశలో నిలబడి ఉండాలి. తప్పని సరిగా చెప్పులు లేదా షూస్ ధరించచాలి. కళ్ల రక్షణకు కళ్లద్దాలు ధరించాలి.

టపాసుల దుకాణాలు ఏక్కడ ఏర్పాటు చేసుకోవాలి?

వ్యాపారులు దుకాణాలను జనావాసాలకు దూరంగా ఖాళీ స్థలం రేకుల షెడ్డులో ఏర్పాటు చేసుకోవాలి. ఒక దుకాణానికి మరో దుకాణానికి మధ్య కనీసం మూడు అడుగుల దూరం ఉండాలి. దుకాణలకు దగ్గర అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే ఆర్పడానికి ఇసుక బకెట్లు, రెండు నీళ్ల డ్రమ్ములు ఉంచుకోవాలి.

అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎవరిని సంప్రదించాలి?

అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 101 నెంబర్ కానీ సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ 8712699482 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి

టపాసుల దుకాణాలకు అనుమతులు తీసుకోవాలి


ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

తిరుమలగిరి అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా టపాసుల దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు అనుమతి తీసుకోవాలని బొల్లారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సూచించారు. అనుమతి లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రాకర్స్ దుకాణాల వద్ద సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి వెల్లిడించారు. ఇటీవల నగరంలోని కొన్ని క్రాకర్స్ దుకాణాలలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. దీపావళి పర్వదినాన్ని యాదవులు అత్యంత పవిత్రంగా భావించే సదర్ ఉత్సవాలను ఏ సమయంలో ఎక్కడ నిర్వహిస్తున్నారో తెలుపుతూ ఉత్సవ నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో సదర్ ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆయన, బందోబస్తును కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నో పార్కింగ్ జోన్లలో వాహనాలను పార్క్ చేస్తే కేసులు

వాహన యజమానులకు జరిమానా, కౌన్సెలింగ్


బోయిన్‌పల్లిలోని కార్ల షోరూమ్‌ల వద్ద వాహన యజమానులకు చలాన్ వేస్తున్న ట్రాఫిక్ సీఐ రవికుమార్

బోయిన్‌పల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నో పార్కింగ్ జోన్లలో వాహనాలను పార్క్ చేస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. నగరంలోని బోయిన్‌పల్లి ప్రాంతంలో మేడ్చల్ జాతీయ రహదారితోపాటు పలు ప్రాంతాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ క్రమంలో బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వివిధ రకాల కారుల షోరూమ్‌లు, బైకుల షోరూమ్‌లు వెలిశాయి. ఆ షోరూంల ఎదుట పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల పక్కన ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని పలువురు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్, నార్త్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు రెండు రోజులుగా బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించి నో పార్కింగ్ జోన్‌లో నిలిపిన వాహనాలను గుర్తించారు. అందుబాటులో ఉన్న వాహన యజమానులకు జరిమానా విధించి, ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సెలింగి ఇచ్చారు. వాహనాలను క్రేన్ సహాయంతో బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిస్తూ, నో పార్కింగ్ జోన్‌లో వాహనాలను పార్కు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహన యజమానులు కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించారు. ముఖ్యంగా కార్లకు సైరన్లు పెట్టి నడిపిస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి: నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. పోలీస్ సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌రాజు విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఎస్‌ఐ సతీష్ రెడ్డి, ఏఎస్‌ఐలు ప్రశాంత్‌రెడ్డి, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో క్యాన్సర్ లక్షణాలను గుర్తించాలి: వైద్యులు


మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న ఎంఎన్‌జే వైద్యురాలు

అడ్డగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో క్యాన్సర్ లక్షణాలను గుర్తించాలని, అప్పుడే త్వరగా నయం చేయొచ్చని ఎంఎన్‌జే వైద్యులు పేర్కొన్నారు. ఎంఎన్‌జే, జనహిత ట్రస్టు, సికింద్రాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అడ్డగుట్టలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు నిఖిత, భవ్య క్యాన్సర్ లక్షణాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల్లో వచ్చే బ్రెస్ట్, చెస్ట్ క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గురించడానికి ముందస్తుగా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

22 ఏళ్లు నిండిన మహిళలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గర్భాశయ కాన్సర్(పాప్‌స్మియర్) నిర్ధారణ పరీక్ష, 45 ఏళ్లు నిండిన మహిళలు ఐదేళ్లకు ఒకసారి రొమ్ము క్యాన్సర్ (మామ్మోగ్రాఫీ) నిర్ధారణ పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలు హెచ్‌పీవీ వాక్సిన్ తీసుకోవడం ద్వారా క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడొచ్చని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉంటే రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ కార్యదర్శి ప్రవీణ్‌రావు, కోశాధికారి డాక్టర్ ప్రకాశ్, వైద్యులు దివాకర్, వసుంధర, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు ఎస్ఎన్ మూర్తి, వెంకటనారాయణ, నర్సింగ్‌రావు, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి క్యాంపు కో-ఆర్డినేటర్ సీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తే పరిశ్రమలను మూసివేస్తాం

- టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాలుష్య నిబంధనలను ఉల్లంఘించిన పరిశ్రమలను మూసి వేయడంతోపాటు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సభ్య కార్యదర్శి రవి హెచ్చరించారు. కాలుష్యం, దుర్వాసన సమస్యలపై నగరంలోని పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో పీసీబీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. పారిశ్రామిక ప్రాంతాల్లో దుర్వాసనను నియంత్రించడంలో పారిశ్రామిక సంఘాలు క్లస్టర్ల వారీగా కీలకపాత్ర పోషించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిని సంఘాల ప్రతినిధులు గుర్తించకపోతే, ఆ ప్రాంతంలోని అన్ని పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్దీత సమయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులందరూ తనిఖీలు నిర్వహించాలని, పరిశ్రమల్లోని పరికరాల నాణ్యత, నిర్వహణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా గాలి కాలుష్యాన్ని నియంత్రించే స్క్రబర్ల నిర్వహణ కోసం ప్రతి పరిశ్రమలో డ్యూటీ చార్టలను ఏర్పాటు చేసుకోవా లన్నారు. ఎఫ్లూయెంట్స్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, వ్యర్థ జలాలను అక్రమంగా విడుదల చేయడాన్ని గుర్తించాలన్నారు. పర్యావరణం పట్ల నిర్లక్ష్యాన్ని టీజీపీసీబీ ఎట్టి పరిస్థితుల్లో సహించబోదన్నారు.

ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం

ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం టీజీపీసీబీ మొదటి ప్రాధాన్యంగా తీసుకుంటున్నదని సభ్య కార్యదర్శి రవి వెల్లడించారు. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల పారిశ్రామిక బెల్ట్‌లో వెలువడుతున్న దుర్వాసనపై నివాసితుల నుంచి ప్రజావాణి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా టీజీపీసీబీకి అనేక ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని పరిశీలించి సత్వర చర్యలకు ఆదేశించామన్నారు. అ తర్వాత ఆయన ఫార్మాస్యూటికల్, కెమికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులతో దుర్వాసన నియంత్రణ చర్యల అమలు, కాలుష్య నియంత్రణకు మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడం, పర్యవేక్షణ యంత్రాంగాలను మెరుగుపర్చడం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ రఘు, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్, జాయింట్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


దీపావళి పండుగ సందర్భంగా సికింద్రాబాద్ సిఖ్ విలేజీ మైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అక్కడికి వచ్చి టపాసులు కొనుగోలు చేస్తున్న ప్రజలు




సికింద్రాబాద్‌లోని ఓ స్వీట్ షాపులో మిఠాయిలు కొనుగోలు చేస్తున్న మహిళలు

టపాసులు కాల్చే సమయంలో అజాగ్రత్త వద్దు

- కళ్లజోడు ధరించండి, నిప్పుకు దూరంగా ఉండండి
- డాక్టర్ రవీందర్ గౌడ్, సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్



సనత్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా పటాకులు కాల్చుతూ ప్రమాదాలబారిన పడిన వారిలో కంటి సమస్యలతో పదుల సంఖ్యలో ఆస్పత్రులకు వస్తున్నారని సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ గౌడ్ తెలిపారు. వారిలో కొంతమంది కంటి చూపును సైతం కోల్పోతున్నారని ఆయన అన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారిలో చిన్నారులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోకుండా, నిర్లక్షంగా వ్యవహరిస్తూ పటాకులు కాల్చడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. చిన్నపిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు తప్పనిసరిగా పక్కన ఉండి గమనించాలన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పటాకులను విశాలమైన ఖాళీ స్థలంలోనే కాల్చాలి
- పటాకులు కాల్చే సమయంలో బకెట్ లేదా డ్రమ్‌తో నీటిని దగ్గర పెట్టుకోవాలి
- సులభంగా మంటలు అంటుకునే నైలాన్ దుస్తులు ధరించవద్దు
- కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి
- ఒంటికి దూరంగా పెట్టుకొని పటాకులు కాల్చాలి
- పెద్ద శబ్దంతో పేలే బాంబులకు దూరంగా ఉండాలి
- ఆటంబాంబులు, రాకెట్‌లు వంటివి కాల్చకూడదు
- పటాకులు కాల్చే సమయంలో పెద్ద కళ్లజోడు లేదా ప్రొటెక్టివ్ గ్లాస్ ధరించాలి
- పిల్లలు బాణాసంచా కాల్చే సమయంలో పెద్దలు దగ్గర ఉండాలి
- పెద్దల సమక్షంలోనే పిల్లలు బాణాసంచా కాల్చాలి
- ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పిల్లలు ఏం చేస్తున్నారో పెద్దలు గమనిస్తూ ఉండాలి
- ఒకవేళ ప్రమాదం జరిగితే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి

రేవ్ పార్టీని కుటుంబ పార్టీ అంటారా?

- ఎమ్మెల్యే తలసానిపై కోట నీలిమ ఫైర్



బేగంపేట/ సికింద్రాబాద్/ అమీర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రేవ్ పార్టీని కుటుంబ పార్టీగా చెప్పడం విడ్డూరంగా ఉందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. రెండు రోజల క్రితం జన్వాడ ఫామ్‌హౌస్‌లో జరిగిన ఘటపై ఆమె మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదేళ్లుగా హైదరాబాద్‌లో డ్రగ్స్, రేవ్ పార్టీలు జరిగినా బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించారు. జన్వాడ ఫామ్‌హౌస్ ఘటనను రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై ఆమె మండిపడ్డారు. డ్రగ్స్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంటే.. ఇందులో తప్పులు వెతకడం సరికాదని ఆమె బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. గ్రేటర్ హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చేందుకు కలిసి ప్రభుత్వం యత్నిస్తుంటే, కలిసి రాకుండా బీఆర్ఎస్ నేతలు డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నట్టు వ్యవహరిస్తున్నారని నీలిమ ఆరోపించారు. డ్రగ్స్‌తో పిల్లల జీవితాలు నాశనం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తున్నదని, దీనికి రాష్ట్ర ప్రజలందరూ సహకరించాలని కోరారు.


పృథ్వీరాజ్‌ను సన్మానిస్తున్న లైబ్రేరియన్ హరిబాబు

గ్రంథాలయలను సద్వినియోగం చేసుకోవాలి

అమీర్‌పేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వనరులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్‌నగర్ గ్రంథాలయ అధికారి హరిబాబు సూచించారు. వివిధ పరీక్షలకు సిద్ధపడుతున్న నిరుద్యోగులు, విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఆయన అన్నారు. ఇటీవల విడుదల చేసిన టీజీపీఎస్సీ ఫలితాలలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం పొందిన మెడబోయిన పృథ్వీరాజ్‌ను పలువురు పాఠకులు, గ్రంథాలయ సిబ్బందితో కలిసి హరిబాబు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠకులు కిరణ్, శేఖర్, అజయ్, రాజా, సంజయ్, రాధమ్మ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగికి వీల్ చైర్ అందజేత


చంద్రకళకు వీల్‌చైర్ అందజేస్తున్న ఆశారాణి

సనత్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా నాంపల్లి గ్రామానికి చెందిన కమిశెట్టి చంద్రకళ 9 ఏళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతుంది. వారంలో మూడు రోజులు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటుంది. ఇటీవల పక్షవాతం రావడంతో రెండు కాళ్లు పనిచేయడం లేదు. చంద్రకళ ఆర్థిక పరిస్థితిని గమనించిన నిమ్స్ ఆస్పత్రిలో పీఆర్‌వోగా పనిచేస్తున్న ఆశారాణి సొంత డబ్బుతో వీల్ చైర్ కొనుగోలు చేసి అందజేశారు.

సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ

అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్

సికింద్రాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. వచ్చే నెల 11న ఎన్నికలు జరుగుతాయని ప్రస్తుత అధ్యక్షుడు మర్యాల జగదీశ్వర్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నియమావళి ప్రకారం 2024-26 సంవత్సరానికిగాను సికింద్రాబాద్ ఆవులమందలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. వచ్చే నెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ ఫారం తీసుకుని పూర్తి చేసి ఇవ్వాలన్నారు. 6వ తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉపసంహరణలు, జాబితా ప్రకటన, 11వ తేదీ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్, సాయంత్రం 5 గంటల నుంచి కౌంటింగ్ ఉంటాయని వివరించారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో అభ్యసిస్తున్న పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సివిల్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండ నాగేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు, ఇతర వివరాలు ఓయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, నవంబరు 8లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.